రాగింగ్‌కు పాల్పడిన మెడికోలపై కేసులు 2



జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు 2

AKSHARA TODAY

అక్షరటుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

25-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి.. ఈయన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తాజా రాజకీయాలపై ఎప్పటికప్పుడు తనదైన శైలిలో స్పందిస్తుంటారు. దీటైన కౌంటర్లతో ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుప డుతుంటారు. కాగా.. ఆయన రాజకీయాల్లోనే కాదు.. సామాజిక సేవలోనూ అంతే చురుగ్గా పాల్గొంటారు. పాలిటిక్స్‌లోకి రాకముందు నుంచే ఆయన విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏడీ (అర్వింద్ ధర్మపురి) ఫౌండేషన్ స్థాపించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారులకు పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. అలాగే పార్టీ కార్యకర్తలకు తన ట్రస్ట్ ద్వారా ఆపద సమయాల్లో ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.

- అక్షరటుడే, నిజామాబాద్

అర్వింధుడు అందరివాడు..

▸ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ▸ సామాజిక సేవల్లోనూ ముందున్న నేత



దివంగత నేత డి.శ్రీనివాస్ చిన్న కుమారుడైన అర్వింద్.. మోదీ భక్తుడిగా రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఏకంగా నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురైన కవితను ఓడగొట్టారు. 2024లో రెండోసారి ఎంపీగా విజయం సాధించారు. ఇక.. బీజేపీ అధినాయకత్వం వద్ద కూడా అర్వింద్‌కు మంచి పేరుంది. అగ్ర నాయకులతో సత్సంబంధాలున్నాయి.

పసుపు బోర్డుతో చరిత్ర..

తనను ఎంపీగా గెలిపిస్తే పసుపు బోర్డు తీసుకువస్తానని 2019 ఎన్నికల్లో అర్వింద్ హామీ ఇచ్చారు. ప్రత్యేకంగా బాండ్ పేపర్ రాసిచ్చారు. అయితే బోర్డు ఏర్పాటులో కొంత జాప్యం జరిగినప్పటికీ.. ఇచ్చిన మాట ప్రకారం రైతుల చిరకాల వాంఛను నెరవేర్చారు. ఎట్టకేలకు పసుపు బోర్డు ఏర్పాటు చేయించిన నేతగా అర్వింద్ చరిత్రలో నిలిచారు. ప్రత్యేకించి జిల్లాలోనే పసుపు బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా తన హయాంలో జిల్లాకు ఆరు ఆర్వోబీలను సైతం మంజూరు చేయించారు. ఇందులో రెండు పూర్తి కాగా.. మరో నాలుగింటి పనులు కొనసాగుతున్నాయి. అలాగే నిజామాబాద్, బోధన్‌లో కేంద్రీయ విద్యాలయాలు, నిజామాబాద్‌లో నవోదయ పాఠశాల మంజూరు చేయించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేశారు.

ఏడీ ఫౌండేషన్ ద్వారా విస్తృత సేవలు..

ఎంపీ అర్వింద్ రాజకీయాల్లోకి రాకముందు నుంచే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏడీ ఫౌండేషన్ ద్వారా చిన్న పిల్లల అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందిస్తున్నారు. ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారుల కు సర్జరీలు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు 176 మంది పిల్లలకు ఆపరేషన్లు చేయించి పునర్జన్మ ప్రసాదించారు. కాగా.. ఈ సేవా కార్యక్రమాలన్నింటిని అర్వింద్ సతీమణి ప్రియాంక ధర్మపురి స్వయంగా దగ్గరుండి చూసుకుంటున్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా..

బీజేపీ కార్యకర్తలకు అండగా ఎంపీ అర్వింద్ నిలుస్తున్నారు. వారికి ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ సాయంగా నిలబడుతున్నారు. బూత్ స్థాయి కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడుతున్నారు. ఎవరైనా కార్యకర్త దురదృష్టవశాత్తు చనిపోతే కుటుంబానికి అండగా నిలిచేందుకు లక్ష రూపాయలు తన సొంత డబ్బులను అందజేస్తున్నారు. గత నాలుగేళ్లలో 56 కుటుంబాలకు రూ.62 లక్షల సాయం అందజేశారు. 46 మంది అనారోగ్యం పాలైతే వారి చికిత్స కోసం సుమారు రూ.12 లక్షలు అందించారు. కార్యకర్తల ఇంట్లో శుభకార్యాలు జరిగితే వారికి 20 వేల రూపాయలు అందిస్తున్నారు. కూతురు పెళ్లి చేసిన 17 కుటుంబాలకు.. రూ. 3.40 లక్షలు, కొత్త ఇల్లు కట్టుకున్న 60 మందికి 11.80 లక్షలు ఇచ్చారు. అంతేకాకుండా ఇందూరులో సోమవారం జరగనున్న బూత్ స్థాయి సభ్యుల సమ్మేళనంలో.. మరో 76 మందికి దాదాపు 25 లక్షల రూపాయలు ఆర్థిక సాయం కింద అందజేయనున్నారు. ఇలా అన్నింటా ముందున్న అర్వింద్ అందరివాడిగా మారారని ఆయన అభిమానులు, పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో.. 8 గేట్ల ద్వారా నీటి విడుదల

అక్షరటుడే, ఆర్మూర్ : ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద తగ్గుముఖం పట్టింది. మూడు రోజులుగా వర్షాలు పడటం లేదు. దీనికి తోడు మంజీరపై గల నిజాంసాగర్ గేట్లు మూసి వేశారు. దీంతో జలాశయానికి వరద తగ్గింది. ఎస్సారెస్పీకి ప్రస్తుతం ఎగువ నుంచి 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో 8 వరద గేట్లను ఎత్తి దిగువకు 24,640 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు సైతం నీటిని వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 4,500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3,500, లక్ష్మి కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథ కు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతోంది. మొత్తం 54,187 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది. ఎగువ నుంచి వదర పెరిగితే గోదావరిలో నీటి విడుదలను పెంచుతామని ప్రాజెక్టు ఏఈఈ కొత్త రవి సూచించారు.

ఘనంగా ప్రారంభమైన జెండా జాతర

అక్షరటుడే, ఇందూరు : నగరంలోని జెండా బాలాజీ ఆలయ జెండా ఊరేగింపు ఆదివారం ఉదయం ప్రారంభమైంది. ఆలయ వంశపారపర్య అర్చకులు అజయ్ సంగ్వాయి స్వగృహం పెద్ద బజారు నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాజులపేట వరకు వెళ్లి తిరిగి బాలాజీ ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో వంశపారపర్య అర్చకులు విజయ్ సాంగ్వాయ్, సంజయ్ సాంగ్వాయ్, ఆలయ ఛైర్మన్ ప్రమోద్, డైరెక్టర్ రాజు, ఈవో వేణు తదితరులు పాల్గొన్నారు. జెండా జాతర 15 రోజుల పాటు జరగనుంది. నగరంలోని బాలాజీ ఆలయంలో జెండా పౌర్ణమి వరకు పూజలు అందుకోనుంది. అనంతరం ఆలయం నుంచి శోభాయాత్రగా బయలుదేరి పులాంగ్ సమీపంలో ప్రతిష్ఠిస్తారు. అక్కడ వారం రోజుల పాటు జెండాకు పూజలు చేస్తారు.

యోగా అసోసియేషన్ నూతన కార్యవర్గం

అక్షరటుడే, ఇందూరు: జిల్లా యోగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని యోగా అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలిగా ఐశ్వర్య, సహ కారదర్శులుగా ప్రవీణ్ నాయుడు, రజిత, ఆనంద్ కార్యదర్శిగా సీహెచ్ గంగాధర్, కోశాధికారిగా కమలా వాణి, సభ్యులుగా అశోక్, ప్రవీణ్ కుమార్, గాయత్రి, లోహిదాస్, మాధురి, సుధా, విజయభాస్కర్ ఎన్నికయ్యారు. పరిశీలకులుగా ఒలింపిక్ అసోసియేషన్ నుంచి బొబ్బిలి నర్సయ్య, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి ప్రశాంత్, రాష్ట్ర యోగా అసోసియేషన్ నుంచి ఉప్పు రవీందర్ వ్యవహరించారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం..

అక్షరటుడే, నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం వెలికితీయించారు. నిజాంసాగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన గైని పండరి(28) నిజాంసాగర్ ప్రాజెక్టు చూసి బాసర వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి బయలుదేరాడు. జలాశయం ఉద్యానవనం వద్ద శనివారం సాయంత్రం కాలుజారి ప్రాజెక్టులో పడిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రెస్క్యూ టీంతో పండరి కోసం గాలించగా.. ఆదివారం ఉదయం పండరి మృతదేహం లభ్యమైంది. తండ్రి హన్మాండ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్లు..

వర్షా లు విస్తారంగా కురవడంతో పంటపొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి.. భూమికి పచ్చాని రంగేసినట్లుగా ఎటుచేసినా పంటలు గ్రామ శివార్లలో దర్శనమిస్తున్నాయి. పైర్లమీదుగా వీచే గాలులు ఆవైపు నుంచి వెళ్లేవారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పల్లె అందాలు.. పొలాల పచ్చదనం చూసేకొద్దీ చూడాలనిపించేలా మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. ఆర్మూర్ మండలం దేగాం నుంచి మంథనికి వెళ్లే దారిలో అలాగే చంద్రాయన్ పల్లి లో చెరువు కింద సాగవుతున్న పంట పొలాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– అక్షరటుడే, ఆర్మూర్/ ఇందల్వాయి

ఓటుచోరీ పేరుతో రాహుల్‌గాంధీ డ్రామాలు

అక్షరటుడే, ఇందూరు: ఓటు చోరీ పేరిట రాహుల్ గాంధీ డ్రామాలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణగుప్తా మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రంలో 11 ఏళ్లుగా సాగుతున్న సుపరిపాలనను ఓర్వలేక రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఇటలీ నుంచి వచ్చి గాంధీ పేరును చోరీ చేసింది సోనియా కుటుంబం కాదా అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం అతిపెద్ద కుంభకోణం అని గగ్గోలు చేసి.. ప్రస్తుతం దోషులను ఎందుకు శిక్షించడం లేదని ఎమ్మెల్యే ధన్‌పాల్ ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడటానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కొత్తగా 'మార్వాడీ గో బ్యాక్' పేరిట అల్లర్లు జరిగితే కాంగ్రెస్ ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. హిందువులను విడదీసే కుట్ర జరుగుతోందని వ్యాఖ్యానించారు. సెక్యులర్‌వాదులకు దమ్ముంటే 'రోహింగ్యాల గో బ్యాక్' అనే ఉద్యమం చేయాలని సవాల్ విసిరారు. ఓటు

చోరీ గురించి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పదేపదే మాట్లాడడం తగదని జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. ఓట్లు చోరీ జరిగితే నిరూపించాలని ఛాలెంజ్ చేశారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా అధికారంలోకి వచ్చిన తర్వాత ఓట్లు చోరీ జరిగాయని చెప్పి ఆమెను ఎలాగైతే పదవి నుంచి తప్పించారో, అదే వ్యూహం రాహుల్ గాంధీ ఇక్కడ అమలు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇలాంటి డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అక్షరటుడే, ఇందూరు: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ నిజామాబాద్ సర్కిల్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్కిల్ అధ్యక్షుడిగా రాజేందర్ రెడ్డి, కార్యదర్శిగా కాశీనాథ్, కోశాధికారిగా శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా సుష్మిత, ఆఫీస్ సెక్రెటరీగా ఎస్ఆర్ మూర్తి, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా భరత్, బోధన్ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా గిరిధర్, ఆర్మూర్ కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారిగా కాంతారావు, మోర్తాడ్ డివిజన్ కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా జుబేర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్, సహాయ ఎన్నికల అధికారిగా కరీంనగర్ సర్కిల్ సెక్రెటరీ సంపత్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శి తోట రాజశేఖర్, సర్కిల్ కార్యదర్శి కాశీనాథ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

అక్షరటుడే, నిజాంసాగర్: మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరారు. మద్నూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం తైదల్వార్ రాజు, అనుచరులు, అలాగే అంతాపూర్‌కు చెందిన దానేవార్ విఠల్ పటేల్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. దీంతో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జక్రాన్‌పల్లి మండలం మునిపెల్లిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఈ సందర్భంగా అంతా ఒక్క చోట కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవినాథ్, కృష్ణ, దిలీప్, సాయికుమార్, శ్యాంభట్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అక్షరటుడే, ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లిలో శనివారం మార్కల రాజు ఇల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ఆదివారం పరామర్శించారు. తన వంతుగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామ సుమన్, ఉపాధ్యక్షుడు రోహిత్ గౌడ్, నాయకులు గంగాధర్, నవీన్ గౌడ్, గంగామణి పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

అక్షరటుడే, ఇందూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు.కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, పెద్ది వెంకట రాములు, నాయకులు లక్ష్మి, శంకర్, సాయిలు, గోవర్ధన్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ కార్యక్రమం

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గల హనుమాన్ ఆలయంలో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను, చెట్ల కొమ్మలను తొలగించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, ఆలయ కమిటీ సభ్యులు ఎల్టీ కుమార్, కొక్కెర భూమన్న, సభ్యులు సుంకె నిశాంత్, ప్రశాంత్, వేద రాజ్ కుమార్, గణేష్, మధుసూదన్, నరేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

అక్షరటుడే, నిజాంసాగర్: రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక మృతిచెందిన ఘటన నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి శివారులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మెదక్ జిల్లా ముంబోజిపల్లికి చెందిన కటికే అలీ శనివారం సాయంత్రం జుక్కల్‌లోని తన అత్తగారి ఇంటి నుంచి భార్య, ముగ్గురు పిల్లలతో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో 161 హైవేపై బ్రాహ్మణపల్లి శివారులో వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న భార్య, ముగ్గురు పిల్లలు కింద పడగా, క్షతగాత్రులను పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో రెండో కూతురు రుక్సానా(6)కు తీవ్రగాయాలు కాగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి

అక్షరటుడే, కోటగిరి: కరెంట్ తీగలను ఉపయోగించి చేపలు పట్టడానికి వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పోతంగల్ మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం పోతంగల్ మండలం జల్లపల్లి ఫారం గ్రామానికి చెందిన ముబీన్ (30) స్నేహితులతో కలిసి గ్రామ చెరువు వద్దకు వెళ్లాడు. కరెంటు తీగలను ఉపయోగించి చేపలు పట్టడానికి ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు కరెంటు తీగ అతడికి తగిలి షాక్ కొట్టింది. దీంతో స్నేహితులు వెంటనే ముబిన్‌ను బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడిన మెడికోలపై కేసులు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హెచ్చరించారు. నగరంలోని వీక్లీ మార్కెట్ లో నివాసముంటున్న నిజామాబాద్ మెడికల్ కాలేజీ విద్యార్థి రాహుల్ రెడ్డిని ర్యాగింగ్ చేసిన పలువురిపై పోలీసులు ఆదివారం వన్‌టౌన్ ఠాణాలో కేసు నమోదు చేశారు. పటాన్‌చెరుకు చెందిన రాహుల్ రెడ్డి ప్రస్తుతం కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్నల్ డ్యూటీలో భాగంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో విధులు నిర్వర్తించాడు. అయితే రాహుల్ విధులకు గైర్హాజరైనట్లు సీనియర్ అయిన సాయిరాం పవన్ రిజిస్టర్ లో నమోదు చేశాడు. దీనిపై ప్రశ్నించడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతేగాకుండా శనివారం సాయంత్రం మాట్లాడుదామని పిలిపించి దాడి చేశాడు. సుమారు 15 మంది రాహుల్‌ను ర్యాగింగ్ చేయడంతో పాటు బెదిరించారు. సాయిరాం, పవన్, శ్రావణ్, సాత్విక్ హృదయ పాల్, అభినవ్ పెద్ది, ఆదిత్య దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధిత విద్యార్థి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కఠిన చర్యలు

పాఠశాలలు, కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సాయి చైతన్య హెచ్చరించారు. విద్యాసంస్థల పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తున్నట్లు తెలిసినా, గమనించినా వెంటనే డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700 ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీపీ తెలిపారు.

జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక

అక్షరటుడే, ఇందూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు సోమవారం ఇందూరు పర్యటనకు రానున్నారని జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. నగరంలోని శ్రీరామ గార్డెన్ లో నిర్వహించనున్న బూత్ స్థాయి సమ్మేళనంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుతో పాటు ఎంపీ ధర్మపురి అర్వింద్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద స్వాగత కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.